నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 16 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

చీకట్లోనే డీఎస్సీ కౌన్సెలింగ్

● సెల్‌ఫోన్ లైట్ల మధ్య ధ్రువపత్రాల పరిశీలన ● కూర్చీలు లేక కింద కూర్చున్న అభ్యర్థులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 15 : జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల పాఠశాలలలో డీఎస్సీ-2024 నియామకాల్లో ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రాత్రి వరకు కౌన్సెలింగ్ కొనసాగింది. కేంద్రంలో కరెంట్ లేక చీకట్లో అభ్యర్థులు, అధికారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో అధికారులు ధ్రువపత్రాలను పరిశీలించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళా అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తాగు నీటి సౌకర్యం సైతం కల్పించలేదు. కూర్చోవడానికి కుర్చీలు లేక కింద కూర్చోవాల్సి వచ్చింది.

సెల్‌ఫోన్ లైట్‌తో ధ్రువపత్రాలు చూసుకుంటున్న అభ్యర్థులు

క్రీడలతో మానసికోల్లాసం

గుడిపేట పోలీస్ బెటాలియన్‌లో క్రీడా పోటీలు

హాజీపూర్, అక్టోబర్ 15 : మండలంలోని పోలీస్ బెటాలియన్‌లోని అధికారులకు, సిబ్బందికి నిర్వహిస్తున్న వార్షిక క్రీడా పోటీలను బెటాలియన్ కమాండెంట్ వెంకట రాములు ప్రారంభించారు. క్రీడా జ్యోతిని వెలిగించిన అనంతరం పోలీసులతో గౌరవ వందనం స్వీకరించారు. కమాండెంట్ మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు. నాలుగు రోజుల పాటు పోటీలు జరగనుండగా, మొదటి రోజు 100 మీటర్లు, టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అస్టిటెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్ రావ్, కాళిదాసు, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్. సంతోష్ సింగ్, బెటాలియన్ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కమాండెంట్ వెంకట రాములు

నాసిరకం.. నష్టభయం..!

నాటిన రెండు నెలలకే పొట్టకు వచ్చిన ఓ కంపెనీ విత్తనాలు

● పొలమంతా కాకుండా అక్కడక్కడా గొలుసులు ● నెన్నెల మండలంలో వందలాది ఎకరాల్లో పంట ● దిగుబడి రాదేమోనని అన్నదాతల ఆందోళన

యేటా నాసిరకం విత్తనాలు మార్కెట్‌లను ముంచెత్తుతుండగా, రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నది. గత వానకాలం సీజన్‌లో నెన్నెల మండలంలోని పలు గ్రామాల్లో వేసిన ఓ కంపెనీ వరి సీడ్స్ రెండు నెలలకే పొట్ట దశకు రాగా, అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. పొలమంతా ఒకేసారి కాకుండా అక్కడక్కడా ఈనగా (వరి కంకులు), దిగుబడి రాదేమోనన్న భయం వారిని వెంటాడుతున్నది.

అక్కడక్కడా కనిపిస్తున్న వరి కంకులు

మంచిర్యాల (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/నెన్నెల, అక్టోబర్ 15 : మంచిర్యాల జిల్లాలో 1,60,065 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కొన్ని వేల ఎకరాల్లో సన్నరకాలు వేశారు. విత్తనాలను బట్టి 130 రోజుల నుంచి 155 రోజుల వ్యవధిలో పంట కాలం పూర్తవుతుంది. జై శ్రీ రాంపంటి వాటికి దాదాపు 150 రోజులు పడుతుంది. జిల్లాలోని పలు మండలాల్లో రైతులు జూలై చివరి మాసం నుంచి ఆగస్టు చివరి వరకు నాట్లు వేశారు. కాకపోతే రైతులు చెబుతున్న ఓ కంపెనీ విత్తనాలు వేసిన నెల రోజుల నుంచే పొట్ట దశకు రావడం మొదలైంది. 60 రోజుల వ్యవధిలో దాదాపు 15 శాతం పంట పొట్టకు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మిగిలిన 85 శాతం పొట్టకు రాలేదు. దీంతో మొదట ఈని బయటికి వచ్చిన కంకులు ఎండిపోయి కిందపడి పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలం పూర్తిగా కోతకు వచ్చే సరికి ఇప్పుడు పొట్టకు వచ్చిన కంకి నేలపాలవుతుందని వాపోతున్నారు. ఎకరానికి దాదాపు మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల నష్టం వచ్చే అవకాశముందని చెబుతున్నారు. సాధారణంగా పొలం అంతా ఒకేసారి పొట్టకు వస్తుంది. కోతలు కూడా ఒకేసారి చేస్తామని, అలాంటప్పుడు కొంతమేరకే వచ్చిన పంటను ఎలా కోసేదని పేర్కొంటున్నారు. నెన్నెల మండలంలో దాదాపు 600 ఎకరాల్లో వరిసాగు చేశామంటున్నారు. ఏ పొలం చూసినా ఇదే తీరు కనిపిస్తుందని వాపోతున్నారు. విత్తనాలు అమ్మిన డీలర్లను రైతులు అడిగితే సంబంధిత కంపెనీ వాళ్లకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చి పంటను పరిశీలిస్తారంటున్నారని, కానీ ఇప్పటి వరకు ఎవరూ వచ్చింది లేదని మండిపడుతున్నారు.

విత్తనాల్లో మాయాజాలం

రైతులు ప్రభుత్వ అనుమతి పొందిన డీలర్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేస్తారు. కొన్ని సందర్భాల్లో విత్తనాలు తయారుచేసే కంపెనీల నుంచి వచ్చే విత్తనాల్లో తేడాలుంటున్నాయని డీలర్లు చెబుతున్నారు. సమస్య వస్తే ఆ కంపెనీకి చెందిన విత్తనం వేసిన ప్రతిచోటా రావాలి. కానీ కొందరు రైతులకు వస్తుందంటే దానికి కారణం ప్రయోగం కోసం సిద్ధం చేసిన విత్తనాలను ప్యాక్ చేసి మార్కెట్‌లోకి వదలడమే అంటున్నారు. కాకపోతే ఇప్పుడు నెన్నెల మండల రైతులు చెబుతున్న కంపెనీకి సంబంధించిన విత్తనాలపై చాలా మంది రైతులు ఇదే తరహా ఫిర్యాదులు చేస్తున్నారని చెబుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత కంపెనీ దృష్టికి తీసుకెళ్లామంటున్నారు. కాకపోతే ఆ కంపెనీ నుంచి మీరు కొనుగోలు చేసినట్లు ఏదైనా పత్రం ఇచ్చారా అంటే మాత్రం డీలర్లు సమాధానం చెప్పడం లేదు. విత్తనం ఒరిజినలైతే పత్రం ఇవ్వడానికి, కంపెనీ ప్యాకింగ్‌ను చూపించడానికి సమస్య ఏమిటని అడిగితే.. కంపెనీ వారే వచ్చి రైతులను కలుస్తారని, సమస్యను పరిష్కరిస్తారని చెబుతూ దాటవేస్తున్నారు. బెల్లంపల్లిలోని ఓ ఆగ్రోస్ నుంచి ఈ విత్తనాలు నెన్నెల మండల రైతులకు అందజేశారు. ఈ విషయపై ఆగ్రోస్ నిర్వాహకులను ఫోన్‌లో సంప్రదించగా సరైన సమాధానం రాలేదు. కంపెనీ ఏజెంట్‌ను సంప్రదించే ప్రయత్నం చేయగా, ఆయన కూడా సమాధానం ఇవ్వలేదు. అధికారులు క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి, నాసిరకం విత్తనాలతో నష్టపోయిన వారికి సంబంధిత కంపెనీ నుంచి పరిహారం ఇప్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారిణి కిరణ్మయిని సంప్రదించగా అక్కడక్కడా వరి పంట సక్రమంగా రావడంలేదని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీనిపై క్షేత్రాలను సందర్శించి విచారణ చేస్తామన్నారు. నాసిరకం విత్తనాలు అని తేలితే చట్టప్రకారం కఠిన చర్యల తీసుకుంటామని చెప్పారు.

నాసిరకం విత్తనాలతోనే పంట దెబ్బ తింది

ఓ కంపెనీ విత్తనాలు మంచివని నమ్మి పంట సాగు చేస్తే రెండు నెలలకే పొలం అక్కడక్కడా ఈనింది. కనీసం 90 రోజుల వరకు పొట్టకు రావాలి. ఇప్పుడు 60 రోజులకే గొలుసులు బయటికి వచ్చినయి. ఇప్పుడు ఈనిన కంకి పొలం కోత వరకు ఉండదు. నాసి రకం విత్తనాల వల్లే ఇలా జరిగింది. కంపెనీ వాళ్లు వచ్చి న్యాయం చేయాలి. లేదంటే ఆందోళనలకు దిగుతాం.

- తోట మధు, రైతు, నెన్నెల

తాండూర్ : ఎంజేపీ హాస్టల్ గేట్‌కు తాళం వేస్తున్న ఇంటి యజమాని

బతిమిలాడి.. బెదిరించి

అద్దె భవనాల్లోని గురుకులాలకు తాళాలు వేయకుండా అడ్డుకున్న లీడర్లు, అధికారులు

పాఠశాల ముందు వేచి ఉన్న ఉపాధ్యాయులు

● మూడు చోట్ల లాక్ వేసిన యాజమానులు ● ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు ● అధికార పార్టీ నాయకుల తీరుపై విమర్శలు

మందమర్రిలో తాళం వేసి ఉన్న గురుకుల పాఠశాల ప్రధాన గేట్

మంచిర్యాల, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం కిరాయి బకాయిలు చెల్లించడం లేదు. కొన్ని నెలలుగా అద్దె పెండింగ్‌లో ఉండగా, ఆయా భవనాల యజమానులు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అద్దె బకాయిలు చెల్లించని కారణంగా యాజమానులు 15వ తేదీన భవనాలకు తాళాలు వేయాలని నిర్ణయించుకున్నారు. అద్దె చెల్లించాకే గురుకుల భవనాలకు వేసిన తాళాలు తీస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యాలయాల ప్రైవేట్ యాజమానుల సంఘం ఆధ్వర్యంలో కొన్ని అద్దె భవనాల ముందు ప్లెక్సీలు సైతం ఏర్పాటు చేశారు. మంచిర్యాల జిల్లాలోని కొన్ని మండలాల్లో గురుకులాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఈ మేరకు ఇక్కడున్న భవన యజమానులు సైతం తాళాలు వేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న అధికార పార్టీ ఎమ్మెల్యేలు, అధికారులు అద్దె భవనాల యజమానులను బతిమిలాడుకున్నారు. తాళాలు వేస్తే సర్కారు పరువు పోతుందని మొరపెట్టుకున్నారు. కాదూ.. కూడదని తాళాలు వేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామంటూ బెదిరించారు. ఈ విషయాన్ని స్వయంగా ఓ భవన యజమానే 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇంత చేసినా మూడు స్కూళ్లకు యాజమానులు తాళాలు వేశారు. చెప్పినట్లుగానే తాండూర్ ఎంజేపీ భవనానికి తాళం వేసిన ఓనర్ సురభి శరత్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. ప్రిన్సిపాల్ సుద్దాల వినోద్, అధ్యాపకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శరత్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఎంజేపీ భవనాలకు తాళాలు

తాండూర్/మందమర్రి, అక్టోబర్ 15 : అద్దె చెల్లించడం లేదంటూ మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాల భవనాల యజమానులు తాళాలు వేయగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆరుబయటే వేచి ఉండాల్సి వచ్చింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతున్నది. కొద్ది నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడంతో యజమాని సురభి శరత్‌కుమార్ మంగళవారం భవనానికి తాళం వేశాడు. 11 నెలలుగా రూ. 9.90 లక్షలు అద్దె రావాల్సి ఉందని, ఈ విషయమై అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించలేదని శరత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవన యాజమాన్య సంఘం పిలుపు మేరకు హాస్టల్ గేటుకి తాళం వేసినట్లు తెలిపాడు. అద్దె చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, విద్యార్థులు, తల్లిదండ్రులు తమ పరిస్థితిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై హాస్టల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్, కొంత మంది అధికారులు హాస్టల్ వద్దకు చేరుకొని ఇంటి యజమాని, ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. డీసీవో, ఆర్‌సీవో, కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని ప్రిన్సిపాల్‌కు ఎంపీడీవో సూచించారు. అలాగే మందమర్రి పట్టణంలోని పాతబస్టాండ్ ఏరియాలో అద్దె భవనంలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల, కళాశాల భవనం ప్రధాన ద్వారానికి(గేట్)కు మంగళవారం భవన యజమాని తాళం వేశారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రధాన గేటుకు పక్కనున్న చిన్న గేటు నుంచి లోపలికి వెళ్లారు. ఈ విషయమై భవన యజమాని సతీశ్‌ను వివరణ కోరగా.. ఎనిమిది నెలల అద్దె రూ. 16 లక్షలు రావాల్సి ఉందని, ప్రభుత్వం వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

తాళం వేసి తీసిన యజమాని

బెల్లంపల్లి, అక్టోబర్ 15 : బెల్లంపల్లిలోని మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల భవన యజమాని చిదిరాల భావన రుషి తాళం వేసి వెంటనే తీసి నిరసన వ్యక్తం చేశారు. దీంతో యథావిధిగా తరగతులు కొనసాగాయి. ఇదిలా ఉంటే భవనానికి తాళం వేసి ఉపాధ్యాయులు, విద్యార్థినులు లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారని ప్రిన్సిపాల్ రమాదేవి ఫిర్యాదు మేరకు భావనరుషిపై కేసు నమోదు చేశారు.

ముదురుతున్న ఎస్పీఎం వివాదం

● లారీ అసోసియేషన్‌కు-యాజమాన్యానికి మధ్య కుదరని సయోధ్య ● కలెక్టర్, ఎస్పీ చర్చలు జరిపినా ఫలించని వైనం

● కొనసాగుతున్న సమ్మె ● కార్మిక కుటుంబాలపై ప్రభావం ● మొండి వైఖరి వీడాలి : మాజీ ఎమ్మెల్యే కోనప్ప

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబరు 15 (నమస్తే తెలంగాణ) : సిర్పూర్ పేపర్ మిల్లులో యాజమాన్యానికి-లారీ అసోసియేషన్‌కు మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతున్నది. ఈ నెల 5న ప్రారంభమైన లారీల యజమానుల సమ్మె ఇంకా కొనసాగుతున్నది. ఎస్పీఎం యజమాన్యం- లారీ అసోసియేషన్‌తో జరిపిన చర్చలు విఫలం కావడం, కలెక్టర్, ఎస్పీ సమక్షంలో జరిపిన చర్చలు కూడా ఫలించకపోవడంతో లారీ యజమానులు సమ్మె కొనసాగిస్తున్నారు. దాదాపు 10 రోజులుగా ఆందోళన చేపడుతున్నప్పటికీ ఎస్పీఎం యాజమాన్యం స్పందించడం లేదని, తమ న్యాయమైన సమస్యకు పరిష్కారం చూపే వరకూ ఆందోళన విరమించేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

లారీ అసోసియేషన్‌కు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న కోనేరు కోనప్ప

కార్మికులపై ప్రభావం

దాదాపు 160 లారీలు ఎస్పీఎంలో ఉన్నాయి. లారీల యజమానులతో పాటు డ్రైవర్లు, క్లీనర్‌లు, లోడింగ్, అన్‌లోడింగ్ సిబ్బంది, మెకానిక్‌లు.. ఇలా అంతా కలిసి దాదాపు వెయ్యి మంది వరకు లారీలపై ఆధారపడి జీవిస్తున్నారు. కంపెనీలో పనిచేసే కార్మికులు దాదాపు 2500 వరకు ఉంటారు. లారీల సమ్మెకారణంగా లోడింగ్ అన్‌లోడింగ్ జరుగకపోవడంతో కార్మికులందరిపై ప్రభావం పడుతోంది. కంపెనీకి తీవ్రనష్టం జరుగుతోంది. సమ్మె కారణంగా అటు యాజయాన్యంతో పాటు కార్మికులు కూడా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కారించే వరకు సమ్మె కొనసాగుతుందని లారీ అసోసియేషన్ చెబుతున్నది.

యాజమాన్యం మొండి వైఖరి వీడాలి : కోనప్ప

ఎస్పీఎం మొండి వైఖరి వీడాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం లారీల యజమానులు తమ కుటుంబాలతో సహా సమ్మెలో పాల్గొనగా, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మూత పడిన ఫ్యాక్టరీని గత సర్కారు ఎంతో కష్టపడి ప్రారంభించిందని, స్థానికంగా ఉండే వందలాది మందికి ఉపాధి కల్పించిందన్నారు. ఇప్పుడు యాజమాన్యం వైఖరి వల్ల మళ్లీ ఎస్పీఎంను సమస్యలు చుట్టుముడుతున్నాయని తెలిపారు. సమస్య మరింత జఠిలం కాకముందే యాజమాన్యం స్పందించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కంపెనీ వ్యవహరిస్తోందని, వేలాది మందికి ఉపాధిని కల్పించే కంపెనీ మొట్టుదిగి రావాలని కోరారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా-కంపెనీ మీద చర్యలు తీసుకోకుండా అధికారులు వెనుకడుగు వేస్తున్నారని కోనేరు కోనప్ప ఆరోపించారు.

డిమాండ్లు ఇవే..

- 2019లో నిర్ణయించిన ట్రాన్స్‌ఫోర్టు చార్జీలను సవరించాలి.
- పెరిగిన డీజిల్ ధరలు, టోల్‌గేట్ చార్జీలకు అనుగుణంగా రేట్లు పెంచాలి.
- అసోసియేషన్ లారీలకు మొదటి ప్రాధాన్యమివ్వాలి.
- ప్రస్తుతం 17 ప్రాంతాలకే ట్రాన్స్‌ఫోర్టుకు అనుమతి నిస్తున్నారు. 34 కేంద్రాలకు పంపించాలి.

రక్షణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 15 : గీత కార్మికుల సంక్షేమం కోసం అందిస్తున్న కాటమయ్య రక్షణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్‌తో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం, రక్షణ కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 38 మందికి, ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 31 మందికి కిట్లు అందించామన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ప్రతి గీత కార్మికుడు రక్షణ కిట్లను ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి సజీవన్, ఆసిఫాబాద్ ఆబ్కారీ సీఐ రమేశ్, గౌడ సంఘం నాయకులు బాలేశ్‌గౌడ్, రంగు మహేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కిట్లు అందుకున్న వారితో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ప్రజాప్రతినిధులు

17న విద్యా సంస్థలకు సెలవు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 15 : కుమ్రం భీం వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 17న జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా సంస్థలు 17న సెలవుదినంగా పాటించి, ఇందుకు బదులుగా నవంబర్ 9న పని దినముగా నిర్వహించాలని పేర్కొన్నారు.

భీం వర్ధంతిని ఘనంగా జరుపుకుందాం

● కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, పీవో ఖుష్బూ గుప్తా ● ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి ఏర్పాట్లు పరిశీలన

కెరమెరి, అక్టోబర్ 15 : భీం 84వ వర్ధంతిని ఘనంగా జరుపుకుందామని, ఇందుకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం జోడేఘాట్‌లో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి భీం వర్ధంతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ వర్ధంతి, దర్బార్‌కు వీఐపీలు వస్తుండడంతో హెలీప్యాడ్ నుంచి సభాస్థలానికి వచ్చేమార్గంలో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా బారీకేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. భోజనం, తాగు నీరు ప్రదేశంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భీం స్మృతివనం, ఆదివాసీ స్మారక మ్యూజియాన్ని సందర్శించారు. ప్రజల సౌకర్యార్థం హట్టి నుంచి జోడేఘాట్ వరకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. అన్ని శాఖల స్టాళ్లు ఏర్పాటు చేసి, ప్రజల నుంచి వచ్చే అర్జీలను స్వీకరించేలా ప్రత్యేక కౌంటర్ సిద్ధం చేయాలన్నారు. భీం మనుమడు సోనేరావ్, ఉత్సవ కమిటీ చైర్మన్ పెందోర్ రాజేశ్వర్, డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్, ఎంపీడీవో మహ్మద్ అష్జద్‌పాషా, డిప్యూటీ తహసీల్దార్ గోడం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వేడుకలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, పీవో, ఎస్పీ

సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 15 : సిర్పూర్ పేపర్ మిల్లు ప్రతినిధులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి సిర్పూర్ పేపర్ మిల్లు ప్రతినిధులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలపై కమిటీ వేసి సమగ్ర విచారణ జరిపి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిర్పూర్ పేపర్ మిల్లు ప్రతినిధులు స్థానిక లారీ యజమానులకు పని కల్పించాలని, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఇరువర్గాలు సమన్వయంతో చర్చించుకొని రవాణా ధరలను నిర్ణయించుకోవాలని, మిల్లు అభివృద్ధితో పాటు లారీ యజమానులు లబ్ధి పొందేలా సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డీఎస్పీలు రామానుజన్, కరుణాకర్, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎస్పీఎం ప్రతినిధులు, లారీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే